రైతుబజారులో దళారుల దౌర్జన్యం

- ప్రశ్నించిన వినియోగదారులపై దాడులకు తెగబడుతున్న వైనం
- దళారుల దాడిలో వినియోగదారుడికి తీవ్ర గాయాలు
- రైతుబజారులో రెండు గ్రూపులుగా ఏర్పడిన దళారులు
- నిత్యం గొడవలతో రైతుబజారులో ఆందోళన



దళారుల దాడిలో గాయపడిన వినియోగదారుడు



రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరలు అమ్మకం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోరు. తూకాలు సక్రమంగా ఇవ్వరు అంటూ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ధర అడుగరాదు. తూకాల్లో తేడా ఉన్నా ప్రశ్నించరాదు. వినియోగదారులు ప్రశ్నిస్తే.. ఇక అంతే.. వారిపై దాడులకు తెగబడతారు. దళారులు సాగిస్తున్న దౌర్జన్యాల వల్ల కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో నిత్యం ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. రైతుబజారు సిబ్బంది దళారులను అనేక సార్లు బయటికి పంపుతున్నా కూటమి పార్టీల నేతల సిఫారసులతో తిష్ట వేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రైతుబజారులో నిత్యం గొడవలకు దిగుతున్న వారిపై పోలీసులు మెతక వైఖరి అవలంభించడం వల్ల వినియోగదారులకు సమస్యలు తప్పడం లేదు.

రాష్ట్రంలోని ప్రధానమైన రైతుబజార్లలో కర్నూలు సి.క్యాంపు ఒకటిగా గుర్తింపు పొందింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ, బీజేపీ, జనసేన నేతలే ఇక్కడ దళారులను ప్రోత్సహిస్తున్నారు. కూటమి పార్టీ నేతల అండదండలు ఉండటంతో దళారులు చెలరేగిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దళారులను కట్టడి చేసేందుకు ప్రయత్నించే సిబ్బందిపై తిరుగబడుతుండటం గమనార్హం. దళారుల ఆగడాలపై చర్యలు లేకపోవడంతో అడ్డూఅదుపు లేకుండా వ్యవహరిస్తున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది.

రైతులకు దక్కని చోటు

రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలు తదితర వాటిని అమ్ముకునే వారు దాదాపు 400 మంది ఉన్నారు. ఇందులో పట్టుమని 10 మంది కూడా రైతులు లేకపోవడం గమనార్హం. నిజమైన రైతులు ఒకరిద్దరు ఉంటే వారిని పొమ్మనలేక పొగపెట్టడం నిత్యకృత్యమైంది. రైతులు తాము తెచ్చుకున్న వాటిని దళారులకు అప్పగించి పోవాల్సిందే. లేకపోతే వారిని స్థిమితంగా కూర్చోనివ్వరు. నిబంధనల ప్రకారం రైతుబజారులో కూరగాయలు అమ్మకోవాలంటే పొలం ఉండాలి. కూరగాయలు సాగు చేస్తూ ఉండాలి. కూరగాయలు సాగు చేస్తున్నట్లుగా హార్టికల్చర్ కన్సల్టెంటు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంది. అటువంటి రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తారు. వారు మాత్రమే కూరగాయలు అమ్మకోవాల్సి ఉంది. కూటమి పార్టీ నేతల సిఫార్సుల కారణంగా ఇది రైతుబజారులో అమలు కావడం లేదు. సెంటు పొలం లేని దళారులు ఇటు రైతుల నుంచి, అటు కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నుంచి కొని తెచ్చుకొని రైతు బజారులో అమ్మకుంటున్నారు.

ప్రశ్నిస్తే వినియోగదారులపై దౌర్జన్యం

దళారుల్లో 95 శాతం మందికి ఎలాంటి భూములు లేవు. భూములు ఉన్నా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయరు. ఒకరిద్దరు ఒకటి, రెండు ఆకుకూరలు, మరో ఇద్దరు, ముగ్గురు ఒక రకం కూరగాయ సాగు చేస్తూ మిగిలిన వాటిని కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు చేసుకొని వచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. దళారులు చెప్పిన ధరకే వినియోగదారులు కొనాలి. బోర్డులో తక్కువ ధర ఉందని, తూకాల్లో తేడా ఉందని ప్రశ్నించరాదు. ప్రశ్నిస్తే వినియోగదారులపై దౌర్జన్యానికి తెగబడుతున్నారు. ఈ నెల 1వ తేదీన ఓర్వకల్ మండలం నన్నూరుకు చెందిన ఓ వ్యక్తి కూరగాయలు కొనేందుకు రైతుబజారుకు వెళ్లారు. చిల్లర విషయంలో వినియోగదారుడు దళారీని ప్రశ్నించినందుకు దాడికి తెగబడ్డాడు. ఈ దాడితో వినియోగదారునికి తీవ్ర గాయాలయ్యాయి. గతంలోనూ వినియోగదారులపై దాడులకు పాల్పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. రైతుబజారులో దళారులు రెండు గ్రూపులుగా ఏర్పడి తరచూ ఘర్షణలకు పాల్పడుతున్నారు. వారం రోజుల క్రితం దళారుల్లోనే రెండు గ్రూపుల మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. ఒకరిపై ఒకరు దాడులకు ప్రయత్నించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందినప్పటికీ చర్యలు లేవు. ఇలాంటి ఘటనలు ఇటు వినియోగదారులకు, అటు రైతులకు ఇబ్బందికరంగా మారాయి. ఒకవైపు గొడవలు, మరోవైపు ప్రశ్నించే వినియోగదారుల పట్ల పరుషంగా వ్యవహరిస్తుండటం, దౌర్జన్యానికి సైతం దిగుతుండటంతో వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం కంట్రోల్‌లో నడిచే రైతుబజారులో దళారులు హవా నడిపిస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. రైతుబజారులో ఇటీవల జరుగుతున్న గొడవలు, ప్రశ్నించిన వినియోగదారుల పట్ల దౌర్జన్యం చేయడం తదితర వాటిపై ఎస్టేటు అధికారి కళ్యాణి 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. గొడవలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుబజారులో ఇద్దరు పోలీసులను బందోబస్తుగా ఏర్పాటు చేయాలని కోరారు.

క్లుప్తంగా

పైపులైన్ మరమ్మతులు పూర్తి



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): స్థానిక దేవనగర్ సమీపంలో అదనపు రైల్వే లైన్ పనుల కారణంగా దెబ్బతిన్న మున్సిపల్ 400 ఎంఎం పైపులైన్ మరమ్మతు పనులు పూర్తి చేసినట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. మంగళవారం స్థానిక దేవనగర్ వద్ద మరమ్మతు పనులను కమిషనర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మనోహర్ రెడ్డి, డీఈఈలు గిరిరాజు, నరేష్‌తో కలిసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. రైల్వే లైన్ పనుల్లో మున్సిపల్ పైపులైన్ దెబ్బతిందన్నారు. వెంటనే మరమ్మతు పనులు చేపట్టినట్లు చెప్పారు. బుధవారం నుంచి 21వ వార్డు 25వ వార్డులలో యథావిధిగా తాగు నీటిని సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు 2వ వార్డులో ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సు వసూలు చేస్తున్న నోడల్ అధికారి, సచివాలయాల కార్యదర్శుల వద్దకు వెళ్లి కమిషనర్ ఆరా తీశారు.

రజక నేతలకు నివాళి



గిడ్డయ్య, పుల్లన్న చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఏపీ రజక వృత్తిదారుల సంఘం బలోపేతానికి పుల్లన్న, గిడ్డయ్య చేసిన సేవలు మరువలేనివని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేకర్, సీఐటీయూ నాయకులు రాముడు కొనియాడారు. మంగళవారం సంఘం కార్యాలయంలో న్యూసిటీ కమిటీ కార్యదర్శి సి.శేషాద్రి అధ్యక్షతన ఐదో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వారి చిత్ర పటాలకు సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. 2000 సంవత్సరంలో ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఏర్పడిన తరువాత కర్నూలు జిల్లాలో సంఘం విస్తరించడంలో పుల్లయ్య, గిడ్డయ్య ఎనలేని కృషి చేశారన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సి.జయమ్మ, ఈశ్వరమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు పతకాలు



కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): పల్నాడు జిల్లాలో ఈ నెల 3వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను మంగళవారం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు స్టేడియంలోని తన చాంబర్‌లో అభినందించారు. డీఎస్‌డీఓ మాట్లాడుతూ.. అండర్– 14 బాలబాలికల విభాగంలో కాంస్య పతకం, అలాగే అండర్–19 బాలికల విభాగంలో కాంస్య పతకాలు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. క్రీడాకారులు అదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. జిల్లా ఫ్లోర్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు శేషు, మల్లికార్జున పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వివాద పరిష్కార కమిషన్ జిల్లా చైర్మన్ కిశోర్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): క్రయ, విక్రయాలు చేసే వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ జిల్లా చైర్మన్ కె.కిశోర్‌కుమార్, సభ్యుడు నారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మిగనూరు రాయ్స్ డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థులు వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్‌ను సందర్శించారు. అక్కడ వారికి వినియోగదారుల హక్కులపై చైర్మన్, సభ్యులు రెండు గంటలపాటు అవగాహన సదస్సును నిర్వహించారు. న్యాయవాదులు అనుదీప్‌రెడ్డి, స్టీఫెన్ పాల్గొన్నారు.

ఆదాయం పెంచి అభివృద్ధి చేస్తాం

కర్నూలు(టౌన్): మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయం పెంచి వాటితో నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం మంత్రి, ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ పన్నుల మీదే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ వనరుల ద్వారా ఆదాయం సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

గురుకులం ఏర్పాటుకు సహకారం



కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసిన స్వామి నారాయణ ట్రస్టు సభ్యులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో ప్రతిష్టాత్మక స్వామి నారాయణ గురుకులం ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆ సంస్థ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. మంగళవారం స్వామి నారాయణ గురుకులం ట్రస్టు ప్రతినిధులు సుక్ వల్లభ్ స్వామి, సద్గున్ ప్రియ్ స్వామి కలెక్టర్‌ను ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు వారు కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు పరిధిలోని ట్రిపుల్ ఐటీ డీఎం, ఎమ్మిగనూరు మండలం బనవాసి వద్ద గురుకులం ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాలను పరిశీలించి కలెక్టర్‌ను కలిశారు. అందుకు కలెక్టర్ జిల్లా యంత్రాంగం తరఫున అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారికి హామీ ఇచ్చారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

కర్నూలు (టౌన్): స్థానిక అశోక్ నగర్ పంప్‌హౌస్ ప్రాంతంలో మంగళవారం గూడెం కొట్టాలకు చెందిన 150 మంది పేదలకు మంత్రి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం కొట్టాల వారికి పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రిజిస్టర్ పట్టాలు వారి పేరు మీదనే ఇస్తున్నామన్నారు. త్వరలోనే గూడెం కొట్టాల స్థలంలో కాల్వలు, కరెంట్ స్తంభాలు, రోడ్లను మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తుందన్నారు. నగర శివారులో ఉన్న టిడ్కో ఇళ్లను ఈ ఏడాది చివర్లోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కల్లూరు తహసీల్దారు అంజనేయులు, ఆరోగ్య శాఖ అధికారి విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్ నుంచి విముక్తి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): తొలి దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే క్యాన్సర్ నుంచి విముక్తి పొందవచ్చని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎన్‌సీడీ 4.ఓ లో భాగంగా క్యాన్సర్ వ్యాధిపై సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే స్త్రీ వ్యాధినిపుణులకు, దంత వైద్య నిపుణులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారా ఈ వ్యాధి భారిన పడకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, తగిన శారీరక శ్రమ లేకపోవడం కారణంగా రోజురోజుకూ క్యాన్సర్ రోగుల సంఖ్య పెరిగిపోతోందన్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ మాట్లాడుతూ.. క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించి లక్షణాలున్న వారిని కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రికి ప్రతి మంగళవారం, గురువారం ఓపీ నంబర్ 222కు రెఫర్ చేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిపై అపోహలు తొలగించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌పీఎం హెచ్‌ఓడీ డాక్టర్ సుధారాణి, వైద్యాధికారులు సింధియా శుభప్రద, మహేశ్వరప్రసాద్, వెంకటసుబ్బనాగరాజు, సాయిమాధురి, బిందుమాధవి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి స్ట్రెచర్ల విరాళం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పలువురు దాతలు ఇచ్చిన 20 స్ట్రెచర్లను మంత్రి టీజీ భరత్ మంగళవారం తన జన్మదినం సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కిమ్స్ హాస్పిటల్, ఒమెగా హాస్పిటల్, కేఎంసీ పూర్వ విద్యార్థుల సంఘం వారు ఐదు స్ట్రెచ్చర్ల చొప్పున విరాళంగా ఇచ్చారు. త్వరలో మరో 10 స్ట్రెచర్లను కేఎంసీ విద్యార్థులు అందించనున్నట్లు మంత్రి టీజీ భరత్ తెలిపారు. కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, డాక్టర్ కుమారస్వామిరెడ్డి, డాక్టర్ బాలమద్దయ్య, డాక్టర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి: ఎస్పీ

కర్నూలు: ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి మహిళ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా డయల్ 112, ఎస్‌ఓఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలకు పోలీసులు అత్యవసర సహాయం అందించేందుకు శక్తి యాప్ పనిచేస్తుందన్నారు. 7993485111 నెంబర్‌కు మహిళలు కాల్ చేసినా, మెసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సంకేతాలు వెళ్లిన వెంటనే శక్తి టీమ్ స్పందించి ఆపదలో ఉన్న మహిళలను ఆదుకుంటారని పేర్కొన్నారు.

ప్రైవేట్ టీచర్ ఆత్మహత్య

కర్నూలు (అగ్రికల్చర్): నగరంలోని ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన దయాకర్ (41) అనే వ్యక్తి ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవీంద్ర పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న ఈయన పసుపల గ్రామంలో హిందీపండిట్‌గా పనిచేస్తున్న శైలజను వివాహం చేసుకున్నాడు. ఇటీవల వారి మధ్య అభిప్రాయ భేదాలు రావడంతో భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. కాగా మంగళవారం దయాకర్ నివాసం నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అక్కడికి చేరుకొని పరిశీలించడంతో దయాకర్ ఆత్మహత్య చేసుకున్న విషయం వెలుగుచూసింది. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి



విద్యుత్ శాఖ అధికారికి వినతి పత్రం సమర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఓర్వకల్లు: కూటమి ప్రభుత్వం ప్రజల నివాసాలకు విద్యుత్ స్మార్టు మీటర్లను అమర్చే విధానాన్ని మానుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయడమేగాక, కరెంటు చార్జీలను తగ్గిస్తామని మాయమాటలు చెప్పి, అధికారంలోకి రాగానే విస్మరించడం సిగ్గుచేటన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు ప్రచారంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టాలని పిలుపునిచ్చారని, ఇపుడు నోరు మెదపడం లేదని విమర్శించారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకొని షాపులకు, పరిశ్రమలకు ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని, ట్రూ ఆప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న భారాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. సీఐటీయు మండల కార్యదర్శి శ్రీధర్, మండల అధ్యక్షుడు షాజహాన్, రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు బయటకు తెలియకుండా చీకటి జీఓ

- వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఓర్వకల్లు: పాఠశాల విద్యా హక్కులను హరించే జీఓను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇది విద్యార్థుల సమస్యలు బయటకు తెలియకుండా నోరు నొక్కే ప్రయత్నమేనని మండిపడ్డారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి, విద్యాశాఖ కమిషనర్ విడుదల చేసిన కరపత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలు విద్యార్థి సంఘాల నాయకులు రవీంద్రనాథ్, అయ్యన్న, సురేంద్ర మాట్లాడుతూ.. పాఠశాలల్లోకి ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లితండ్రులు మినహా, మిగతా వారిని అనుమతించరాదని చెప్పడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థి సంఘాలతో సంప్రదింపులు జరిపేవారని గుర్తుచేశారు. విద్యాశాఖ పీటీఎం పేరుతో చేసేందేమిటని, ఎమ్మెల్యేలు, వారి అనుచరులు పాఠశాలల్లోకి వచ్చి సమస్యలు చెప్పిన వారిని బెదిరించారని, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉత్తర్వుల వల్ల ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యా వ్యాపారాన్ని, అక్కడ జరిగే అరాచకాలను వామపక్ష విద్యార్థి సంఘాలు అడ్డుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశాలు ఉండవని వివరించారు. విద్యార్థుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతున్న జీఓను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కేవీఆర్ ప్రిన్సిపాల్‌పై విచారణ చేయాలి



మాట్లాడుతున్న మహేందర్‌నాయుడు, తదితరులు

కర్నూలు సిటీ: కేవీఆర్ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.లాలెప్ప 13 ఏళ్ల నుంచి విద్యార్థుల నుంచి స్పెషల్ ఫీజులు, అక్యుములేషన్ సొమ్ము స్వాహా చేశారని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బిర్లా గేట్ వద్దనున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ నాయుడు, విద్యార్థి సంఘాల నాయకులు రాజు, శివప్రసాద్ గౌడ్, మధు కృష్ణ తదితరులు మాట్లాడారు. కరోనా సమయంలో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపట్టి స్పెషల్ ఫీజులు వసూలు చేశారని, అలాగే అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. కాలేజీలో ఖర్చు చేసిన నిధులపై సమగ్ర విచారణ జరపించాలని, వాచ్‌మన్, స్వీపర్ జీతాల విషయంలో సంతకాల్లో తేడాలు ఉన్నాయని, తక్షణమే ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు స్పందించి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

కర్నూలు(సెంట్రల్): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.కొండప్ప, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్వీ సుబ్బయ్య, గౌరవ సలహాదారుడు వై.కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసగౌడ్ స్పష్టం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే అర్హులైన జర్నలిస్టులదరికీ అక్రిడేషన్లను మంజూరు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినా అమలు కావడం లేదన్నారు. అక్రిడేషన్లు లేకపోవడంతో జర్నలిస్టులు హెల్త్ కార్డులు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రమాద బీమాను పునరుద్ధరించాలని కోరారు. తమిళనాడు, బీహార్ తరహాలో సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరా రు. జర్నలిస్టుల హెల్త్ కార్డులకు చికిత్స చేయని ఆసుపత్రులను బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం విడతల వారీగా పోరాటాలకు దిగుతున్నట్లు చెప్పారు. జర్నలిస్టులు అంజి, దస్తగిరి, శివరాజ్‌కుమార్, అవినాస్, మధు, చిరంజీవి, ధరణి, కిషోర్, ఖలీల్, హుస్సేన్, మస్తాన్, ప్రకాష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆశాలు సక్రమంగా వైద్యసేవలందించాలి



మాట్లాడుతున్న జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): పురుషులకు 21 ఏళ్లు, మహిళలకు 18 ఏళ్లు నిండాకే వివాహం చేయాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులుశెట్టి సూచించారు. మంగళవారం స్థానిక వడ్డేగేరిలో నిర్వహించిన ఆశా సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశా యాప్‌లో అర్హులైన దంపతుల సేవలు, ఐరన్ మాత్రల పంపిణీ, విటమిన్–ఏ ద్రావణం పంపిణీ, నవజాత శిశువుల సేవల వివరాలను క్రమం తప్పకుండా అప్‌లోడ్ చేయాలని చెప్పారు. గర్భవతులకు నాల్గవ నెల నుంచి ప్రసవానంతరం బిడ్డకు ఒక సంవత్సరం వయస్సు వచ్చే వరకు మాతాశిశు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కోసం 0124445 1660 కిల్కారి మెసేజ్‌ల గురించి అవగాహన కల్పించాలని సూచించారు.వివాహ వయస్సు, యుక్త వయస్సులో గర్భదారణ వల్ల అనర్థాలు, లింగవివక్షత నిర్మూలన, గర్భస్థ లింగనిర్ధారణ వ్యతిరేక చట్టం, ఆడపిల్లల ప్రాముఖ్యత, తాత్కాలిక గర్భనిరోధక పద్ధతుల గురించి ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకురాలు పద్మావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి



ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కాల్వ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ఓవర్ హెడ్ స్టోరేజ్ (ఓహెచ్‌ఎస్‌ఆర్) ట్యాంకులకు ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి భూమి పూజ నిర్వహించి, పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ నిధులను వినియోగించి తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాల్వ గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.1.12 కోట్లు మంజూరు కాగా సచివాలయం వద్ద 90 వేల లీటర్ల సామర్థ్యంతో, నవాజ్ కట్ట ప్రాంతంలో 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంకులను నిర్మిస్తున్నట్లు చెప్పారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ.. జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అంతకుముందు కలెక్టర్, ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ గ్రామ శివారులోని కోనేటి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు, సర్పంచులు కేపీ వెంకటేశ్వర్లు, చంద్రగోవర్ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలి

కల్లూరు: గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే చర్యలు తప్పవని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి హెచ్చరించారు. మంగళవారం కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో గ్రామ పంచాయతీలలో ఘన వ్యర్థాల నిర్వహణపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరువేరుగా అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డ్రైనేజీ కాలువల్లో పూడిక లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగాలని, డిప్యూటీ ఎంపీడీఓలు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత పంచాయతీ కార్యదర్శులతో పాటు డిప్యూటీ ఎంపీడీఓలపై చర్యలు ఉంటాయన్నారు. డీపీఓ జి.భాస్కర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. చెత్త సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేయాలన్నారు. డివిజనల్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ అధికారులు, డీసీడీపీఆర్‌సీ మంజులవాణి, ఎంపీడీఓలు, కల్లూరు మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

7న ముత్తైదువులకు పసుపు పారాణి

కర్నూలు కల్చరల్: పవిత్ర శ్రావణ మాసం రెండవ గురువారం సందర్భంగా ఈ నెల 7వ తేదీన కర్నూలు ఓల్డ్ సిటీలోని దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ముత్తైదువులకు పసుపు, పారాణి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు మహాబలేష్ తెలిపారు. మాతృమూర్తులను లక్ష్మీ స్వరూపంగా భావించి పసుపు, కుంకుమ, ఫల, తాంబూలం, గాజులు తదితర మంగళ ద్రవ్యాలను ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బస్టాండులో కంపు.. కంపు



మరుగుదొడ్ల నుంచి నీరు లీకై బస్టాండు ఆవరణలోకి చేరిన దృశ్యం

కర్నూలు (సిటీ): స్థానిక ఏపీఎస్‌ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్థంగా మారింది. బస్టాండ్ ముఖద్వారం వద్ద ఉన్న టాయిలెట్లను రెగ్యులర్‌గా శుభ్రం చేయకపోవడంతో పైపుల నుంచి మురుగు నీరు బయటకు వస్తోంది. ఈ నీటి దుర్వాసన వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. టాయిలెట్ల నిర్వహణ కాంట్రాక్టర్‌పై పలుమార్లు ఫిర్యాదులు చేసినా కాంట్రాక్టర్, ఆర్టీసీ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో అటు వైపు వెళ్లే ప్రయాణికులు భరించలేని దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పటికప్పుడు టాయిలెట్ పైపులను శుభ్రం చేయకపోవడంతో తరచుగా బ్లాక్ అయి నీరంతా బయటకు వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి టాయిలెట్ నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.